# శాస్త్రీయ దృక్పథం పై ప్రకటన

శాస్త్రీయ దృక్పథం కోసం చేపట్టిన ప్రచార ఉద్యమం ముగింపు సందర్భంగా....

శాస్త్రీయ దృక్పథంపై ప్రకటన కోసం నిర్వహించిన జాతీయ సమ్మేళనం సందర్భంగా....

తీర్మానించబడినది

*(ఫిబ్రవరి 28, 2024 కలకత్తా)*

## ప్రస్తుత పరిస్థితుల్లో శాస్త్రీయ దృక్పథం – ప్రకటన

**సారాంశం**

భారతదేశంలో శాస్త్రీయ దృక్పథం పైనా సర్వాంగీకృతమైన పద్ధతులతో, అవగాహనతో రూపుదిద్దుకున్న విశ్వజనీన జ్ఞానం పైనా పెద్ద ఎత్తున రాజకీయంగా, సామాజికంగా దాడులు జరుగుతున్న కాలంలో మనమున్నాం. ఇప్పుడు మనం మరింత నిబద్ధతతో హేతుతత్వం కోసం, విమర్శనాత్మక ఆలోచనల కోసం,శాస్త్రీయత కోసం పునరంకితం కావల్సివుంది.

గతంలో 1981లోనూ, 2011లోనూ శాస్త్రీయ దృక్పథంపై మనం ప్రకటనలు చేసి ఉన్నాం. ఇప్పుడు అటు సమాజంలోనూ ఇటు సాంకేతిక విజ్ఞానంలోనూ చాలా మార్పులు వచ్చాయి. దీంతోపాటు అజ్ఞానాన్ని సర్వవ్యాప్తం చేసేందుకు , సైన్సు పట్ల నమ్మకం సడలేలా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి .దీని కోసం సాంకేతిక విజ్ఞానాన్ని విచ్చల విడిగా దుర్వినియోగం చేస్తున్నారు.

ఇప్పుడు మనం ప్రకృతి శాస్త్రాల విజ్ఞానంతో పాటు,సామాజిక మానవ శాస్త్రాల విజ్ఞానాన్ని కూడాపెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. వీటితోపాటు సామాన్య ప్రజల హేతుబద్ధ అనుభవాలను సైతంముందుకు తేవాలి. వీటి ఆధారంగా ప్రస్తుత “సత్యానంతర సంస్కృతిని”(్రాశీర్ తీబ్ష్ట్ర ఎబశ్రీబతీవ) ఉమ్మడిగా ఎదుర్కోవాలి.

మనం మూడు రంగాలపై కేంద్రీకరించి కృషి చేయాల్సి వుంది. ఒకటి రాజ్యం పాత్ర, అది వైజ్ఞానిక సంస్థల్లో అకడమిక్ వర్గాల్లో జోక్యం చేసుకుంటున్న తీరు ,సైన్సును అదే పనిగా దిగజారుస్తున్న దాని ధోరణి. రెండోది మన విద్యారంగంలో అకడమిక్ స్వేచ్ఛ హరించుకుపోవడం. మూడవది పనిగట్టుకుని నకిలీ సైన్సును అశాస్త్రీయ నమ్మకాల్ని వ్యాప్తి చేస్తుండడం. దీనికి విరుగుడుగా ప్రస్తుతం హేతుబద్ధ ఆలోచన ధోరణిని విస్తరింప చెయ్యాలి. దానికి తగ్గ పాలసీల కోసం పోరాడాలి. రాజ్యాంగ విలువగా మనం చెప్పుకున్న శాస్త్రీయ దృక్పథ వ్యాప్తి నేటి తక్షణావసరం. దీనికోసశాస్త్రవేత్తలను, మేధావులను, భావసారూప్యం గల వారిని ముందుకు రమ్మని కోరుతున్నాం.

### పరిచయం

శాస్త్రీయ దృక్పథం పై 1981లో కూనూరులోనూ, 2011లో పాలంపూర్ లోనూ మనం ప్రకటనలు చేసినప్పటికీ ఇప్పటికీ దేశంలోనూ, ప్రపంచంలోనూ చాలా పెద్ద మార్పులే చోటుచేసుకున్నాయి. క్లుప్తంగా

చెప్పుకోవాలంటే ఆనాటి మన ప్రకటనలు ప్రధానంగా అభివృద్ధికి, సామాజిక పురోగతికి శాస్త్రీయ దృక్పథపు అవసరాన్ని నొక్కి చెప్పాయి. కాలక్రమేణా శాస్త్ర సాంకేతిక రంగాలపై మారుతున్న ప్రజల అవగాహనకు అనుగుణంగా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించే ఉద్యమాలు కూడా దేశంలో అభివృద్ధి చెందాయి.

కానీ ఇటీవలి కాలంలో దేశంలోనూ, బయటిప్రపంచంలోనూ గతంలో ఎన్నడూ ఎరగని సవాళ్లు ఎదురవుతున్నాయి. సామాజికంగానూ, రాజకీయంగాను ముంచుకొస్తున్న ఈ ధోరణులకు పనిగట్టుకుని ప్రభుత్వమే వెన్నుదన్నుగా వుంటోంది. శాస్త్రీయ ఆలోచనల్ని, హేతు తత్వాన్ని, విశ్వజనీన శాస్త్రీయ జ్ఞానాన్ని ఈ శక్తులు పని గట్టుకుని వ్యతిరేకిస్తున్నాయి. ప్రపంచమంతా కూడా ఒక "సత్యానంతర సంస్కృతి" విస్తరిస్తోంది. ప్రయత్న పూర్వకంగా అజ్ఞానాన్ని, మేధో వ్యతిరేక వాతావరణాన్ని ఇవి విస్తరింప చేస్తున్నాయి. సైన్స్ పట్ల అపనమ్మకాన్ని పెంచి పోషిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగాలని పనికొట్టుకొని రెచ్చగొట్టడం, ఒక వర్గంపై ప్రత్యేక పక్ష పాతాన్ని ప్రదర్శించడం, తప్పుడు కథనాల్ని వండి మార్చడం, నిరాధారమైన అభిప్రాయాల్ని వెదజల్లడం, కుట్ర సిద్ధాంతాల్ని ప్రచారం చేయడం జోరుగా సాగుతోంది. వీటికి సమాజంనుంచి అంతో ఇంతో అంగీకారం కూడా లభిస్తోంది. బాధాకరం ఏమిటంటే ఇందుకోసం శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఫలాలైన సామాజిక మాధ్యమాల్ని వాడుకోడం!

ఈ నేపథ్యంలో రుజువుతో కూడిన తార్కికతను మనం మరింత నిబద్ధతతో నిలబెట్టాల్సి ఉంది. దీనికోసం ప్రకృతి శాస్త్రాల, సామాజిక మానవ శాస్త్రాలవిజ్ఞానంతో పాటు శ్రామికులు, సాధారణ జనం తమ జీవితాన్నించి నేర్చుకున్న హేతుబద్ధ అనుభవాల్ని కూడా వాడుకోవలసి వుంది. ఇప్పుడు కావలసింది అందరూ అంగీకరించిన వివిధ రంగాల శాస్త్ర పద్ధతులే కాదు, అకడమిక్ వర్గాలకు పరిమితమైన పరిశోధనలు మాత్రమే గాదు, ప్రజానుభవాలు కూడా! ప్రజల జ్ఞానం కూడా! శాస్త్రవేత్తలతో పాటు సగటు ప్రజానీకం కూడా శాస్త్రీయ ఆలోచనాధోరణిని ఆచరణలోకి తెచ్చుకున్నప్పుడే ప్రస్తుత రాజకీయ సామాజిక ధోరణుల్ని నిలవరించగలం.

ప్రస్తుత సవాళ్లను దృష్టిలో వుంచుకొని శాస్త్రీయ దృక్పథంపై మేము ఈ ప్రకటన చేస్తున్నాం. ఇదేమీ గతంలో చేసిన ప్రకటల్ని విమర్శనాత్మకంగా సమీక్షించుడకోడం కాదు. మళ్ళీ వాటిని చర్చకు పెట్టడం కాదు. వాటిలోని సారాన్నే ఈ ప్రకటనలోనూ పొందుపరుస్తున్నాం. గుర్తించాల్సిన అంశం ఏమంటే ఆ ప్రకటనలకు నేటి ప్రకటనకు వైజ్ఞానికాంశాల్లో సారూప్యత వుంది. పద్ధతుల్లోనూ ఎకరూపత ఉంది. పాత చర్చలను తిరగదోడ్డానికి బదులు సూటిగా రాజ్యాంగం ఆదేశించిన శాస్త్రీయ దృక్పథవ్యాప్తి, అన్వేషణ, మానవతా విలువలకు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లపై కేంద్రీకరిద్దాం.

## నూతన ప్రమాదకర ధోరణి

ముందు చెప్పినట్లుగా దశాబ్దాల నుంచి సాగుతున్న శాస్త్రీయ దృక్పథ పురోగతికి ఇప్పుడు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ దాడి ఒకవైపు దూకుడులో ఉన్న సామాజిక సాంస్కృతిక శక్తుల నుంచి, మరోవైపు

ప్రభుత్వ విధానాల నుంచి ఏకకాలంలో ఏదురవుతోంది .ప్రస్తుత ధోరణిని మనం విమర్శనాత్మకంగా అవగాహన చేసుకోవాలి. ప్రతిచర్యకు సిద్ధం కావాలి. ప్రధానంగా మూడు రంగాల నుంచి ఈ ప్రమాదం ఎదురవుతోంది. ఒకటి ప్రభుత్వ విధానాలు, దాని పాత్ర చాలా మారాయి. రెండోది మన వైజ్ఞానిక పరిశోధనాసంస్థల, అకడమిక్ సంస్థల స్వభావంలో కూడా ఊహించని మార్పు వచ్చింది. మూడవది మన సమాజం చివరకు సాధారణ జనంతో సహా రకరకాల తప్పుడు ప్రభావాలకు లోనవుతోంది.

భారత రాజ్యాంగపు 51 ఏ(హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేయాల్సిన బాధ్యతను వక్కాణిస్తుంది. కానీ ఇందులో ప్రభుత్వ బాధ్యత ఏమిటో మాత్రం స్పష్టంగా చెప్పలేదని ఓ అభిప్రాయం ఉంది. పౌరుల బాధ్యత లోనే ప్రభుత్వ బాధ్యత కూడా అంతర్లీనంగా ఉందని మనం సరిపెట్టుకోవచ్చు గానీ రాజ్యాంగం ప్రభుత్వ బాధ్యతను కూడా స్పష్టంగా చెప్పి ఉంటే బాగుండేది.

## రాజ్యం బాధ్యత

స్వాతంత్రం వచ్చాక భారత ప్రభుత్వం శాస్త్రవేత్తల పట్ల, వైజ్ఞానిక సంస్థల పట్ల ఎంతో విశ్వాసం ఉంచింది. ఆనాటి అభివృద్ధి విధానాలు శాస్త్రీయంగా ఉండేవి. పరిశోధనా సంస్థలకు, సమున్నత జ్ఞాన కేంద్రాలకు ఎంతో ప్రాధాన్యత, గౌరవం, స్వయం ప్రతిపత్తి ఉండేవి. ఆనాటి "పారిశ్రామిక విధాన తీర్మానం", "వైజ్ఞానిక విధాన తీర్మానం" మన ప్రణాళికా బద్ధ అభివృద్ధికి మూల స్తంభాల్లాంటివి. పలు రంగాల మేధావుల మార్గదర్శకత్వం వల్లనే ఇది సాధ్యమైంది. ఆ రోజుల్లో వైజ్ఞానిక రంగంలోనూ, సామాజిక రంగంలోనూ పేరొందిన దేశ విదేశీ మేధావుల్ని విధాన నిర్ణయాల్లో భాగస్వాముల్ని చేసారు. దీన్ని బట్టే సైన్సుకూ, శాస్త్రీయతకు ఆ రోజుల్లో ఎంత పెద్ద పీట వేశారో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ వ్యవహారాల్లో ఆ కాలంలో మతం పాత్ర దాదాపు ఉండేది కాదు. ఎలాంటి వివక్షలు కనిపించేవి కావు. అన్ని మతాలకు సమాన గౌరవం ఉండేది. ఇదంతా ఎంత చెప్పుకున్నా కులతత్వ మతతత్వాలను పూర్తిగా నిర్మూలించలేకపోయామనేది కూడా ఒక నిష్టుర సత్యం.

క్రమంగా ఇప్పుడు పరిస్థితి మారింది. అధికారుల, ఉన్నత వర్గాల ఆధిపత్యం పెరిగింది. ప్రతిదీ సాంకేతికంగా చూచే ధోరణి వ్యవస్థల్లోకి జొరబడింది. శాస్త్రవేత్తలకు, సాధారణ జనానికి ఈ మధ్య అగాధం ఏర్పడసాగింది. మన వైజ్ఞానిక సంస్థల పట్ల ప్రజలకు నమ్మకం క్షీణించసాగింది. ఇవన్నీ అధికార వ్యవస్థల చుట్టూ తిరుగుతూ, కార్పొరేట్ ప్రయోజనాల్ని కాపాడుతూ ప్రజావసరాలని పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం విస్తరించింది.

అయినా విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ కథనాల్ని ఎండగట్ట సాగాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలిగాయి. విమర్శనాత్మక దృక్పథానికీ, విధానాల రూపకల్పనలో శాస్త్రీయతకు దోహదపడ్డాయి. ప్రభుత్వం చురుగ్గా శాస్త్రీయ దృక్పథ వ్యాప్తికి పూనుకోకపోవడంతో పై వర్గమే ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థుల్లో ఈ కర్తవ్యాన్ని నిర్వహించ గలిగింది. కేవలం కార్యకర్తలే తోడుగా ఇది సాగినా ఆ రోజుల్లో ప్రభుత్వం కూడా శాస్త్రవేత్తలకు, నిపుణులకు ఈ కృషిలో కొంత తోడ్పడింది వారికీ కొన్ని అవకాశాల్ని కల్పించింది.

## సైన్సునూ, శాస్త్రీయదృష్టినీ నీరుగార్చడం

ప్రస్తుతం వీటన్నిటినుంచీ ప్రభుత్వం తప్పుకొంది. ఇప్పుడు నేరుగా ప్రభుత్వమూ, దాని వ్యవస్థలే శాస్త్రీయ దృక్పథాన్ని పనిగట్టుకొని వ్యతిరేకిస్తున్నాయి. స్వేచ్ఛాయుత, విమర్శనాత్మక, శాస్త్రీయ ఆలోచనలను అణచివేస్తున్నాయి. విధాన నిర్ణయాల్లో శాస్తీయతకు తిలోదకాలిస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే శాస్త్ర పరిశోధనలకు మన ప్రభుత్వం చేసే వ్యయం బాగా తగ్గిపోయింది. ఫలితంగా జ్ఞాన రంగంలో భారత దేశ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతోంది. పరిశోధనలను, నూతన జ్ఞాన సంపాదనను పక్కకు పెట్టి విదేశాల్లో తయారైన విడిభాగాల కూర్పుతో వస్తూత్పత్తి చేయడమే స్వావలంబనగా ప్రభుత్వం చాటింపు వేస్తోంది.

నిధులకు, ఫెల్లో షిప్పులకు తీవ్రమైన కోతలు పడుతున్నాయి. స్వతంత్ర పరిశోధనలకు బ్యూరాక్రాట్ల ధోరణి పెద్ద అడ్డంకిగా మారింది. ఆధిపత్య ధోరణులకు తలొగ్గితే తప్ప,ప్రభుత్వ విధానాలకు తాళం వేస్తే తప్ప పరిశోధకులు ముందుకెళ్లగలిగే పరిస్థితి లేదు. ప్రతిభాపాటవాలు, లోతైన పరిశోధనాత్మక దృక్పథం లాంటివన్నీ పనికిరానివయ్యాయి. ఈమధ్య అభివృద్ధికి సంబంధించిన గణాంకాల్ని, అంతర్జాతీయ సంస్థలు మనకిస్తున్న ర్యాంకుల్ని తప్పుడు కారణాలతో తిరస్కరించడం కొత్త ధోరణిగా మారింది. చివరకు ప్రభుత్వ సంస్థలు రూపొందించిన గణాంకాల్ని కూడా తిరస్కరించడం, వాటిని తమ రాజకీయ అవసరాలకు తగినట్లుగా తారుమారు చేయడం జరుగుతోంది. చాలా సందర్భాల్లో గణాంకాలు లేవంటూనే ,ఏ పద్ధతీ గిద్ధతీ లేకుండా విధాననిర్ణయాలు మాత్రం చేసేస్తున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత చర్చలకు తావు లేకుండా పోతోంది. దీంతో విమర్శనాత్మక ఆలోచనలకు, బహుళత్వానికి ,అకడమిక్ స్వాతంత్రానికి తీవ్రమైన అవరోధాలు ఎదురవుతున్నాయి.

ఫలితంగా శాస్త్రీయ ధోరణులకు తీవ్ర విఘాతం కలుగుతోంది. విధాననిర్ణయాలలో హేతు బద్ధత అడుగంటుతోంది. ఒక మేధో వ్యతిరేక వైఖరి విస్తరిస్తోంది. మేధావుల్ని పట్టుబట్టి ముందుకెళ్ళకుండా వెనక్కు లాగడం మామూలై పోయింది.

రాజ్యమూ, దాని వత్తాసుదారులూ కలిసి సైన్సును శాస్త్రీయ ధోరణలనూ ప్రజల్లో చులకన చేస్తున్నారు. రాజకీయ వర్గాల్లోని ప్రముఖులే అశాస్త్రీయ వాదనల్ని తెరమీదికి తెస్తున్నారు. కల్పనలతో, అతిశయోక్తులతో మన ప్రాచీనశాస్త్ర సాంకేతిక విజయాలనూ, సాంప్రదాయక జ్ఞానాన్ని ఆకాశానికెత్తుతున్నారు. జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. ఇవన్నీ పుక్కిటి పురాణాలే తప్ప ఏ ఆధారాలు లేనివి. ప్రాచీన గ్రంథాల నుంచి అర్థం లేని ఉదాహరణల్ని ముందుకు తెచ్చి, వాటికి ఇష్టం వచ్చిన వ్యాఖ్యానాలను జోడించి, మతం ముసుగు తొడిగి అసమ్మతి గళాలను అణచివేసే దుస్తంత్రాలే తప్ప ఇవి మరేమీ కావు. ఈ కల్పిత ప్రగల్భవాదాల వల్ల మన దేశం వాస్తవంగా ప్రపంచానికి అందించినవి కూడా మరుగున పడిపోతున్నాయి. బహుళ సాంస్కృతిక స్రవంతులతో పాటు, ఎందరో ప్రతిభావంతులు, చేతివృత్తిదారులు సాధించిన గొప్ప సాంకేతిక విజయాల ఫలితాలివి. ఈ ధోరణిని విమర్శిస్తే దేశద్రోహులనీ, పాశ్చాత్య భావజాలాన్ని పులముకున్న వారనీ ముద్ర వేస్తున్నారు. ఫలితంగా మేధోపురోగతికి పునాదులైన భిన్నాభిప్రాయాలు, బహుళాభిప్రాయాలు ఇప్పుడు ఎన్నడూ లేని ముప్పునెదుర్కొంటున్నాయి.

## విద్యారంగంపై దాడి

ఈ ధోరణులిప్పుడు విద్యావ్యవస్థల్లోకి కూడా ప్రవేశించాయి. శక్తివంతమైన ప్రతిఘటన లేకుంటే మొత్తం ఒక తరానికి తరాన్నివి ప్రభావితం చేస్తాయి. మన ప్రాచీన జ్ఞానం సర్వోన్నతమైనదని పాఠశాల నుంచి కళాశాల దాకా గ్రంథాల్ని తిరగరాస్తున్నారు. ఇతర నాగరికతల్నీ, వాటి విజయాలన్నీ చూడ నిరాకరిస్తున్నారు. ప్రాచీన భారత దేశంలోనూ, చైనాలోనూ, తూర్పు నాగరికతల్లోనూ వెలసిన విజ్ఞానం గురించి చెప్పకూడదని కాదు. వాటికి తక్కువ ప్రాధాన్యత వుందనీ కాదు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ,పారిశ్రామిక విప్లవాన్ని, వాటి నేపథ్యాల్నీ చూడ నిరాకరించడం మాత్రం అన్యాయం. ఇలా చేయడం వాస్తవాన్ని కప్పిపుచ్చడమే కాదు మనల్ని మనం తప్పుదారి పట్టించుకోడం కూడా. కేంద్రమే గాక చాలా రాష్ట్రాలు కూడా పాఠ్య గ్రంథాల్ని ఇలా తిరగరాయిస్తున్నాయి. వీటిలో కల్పిత కథనాల్ని చొప్పిస్తున్నాయి. ఆధునిక విజ్ఞాన శాస్త్రం సాధించిన మహాద్భుత విజయాలను తెర వెనుకకు నెడుతున్నాయి.

అంతేకాదు ఈ సరికొత్త పాఠ్యగ్రంథాల్లో కీలకమైన చారిత్రక సామాజిక ఆర్థిక పర్యావరణ అంశాలకు తావు లేకుండా చేస్తున్నారు. ముందే మనది పరీక్షల మీద ఆధారపడ్డ విద్యా విధానం. ఇందులో విమర్శనాత్మక ఆలోచనలకు స్థానం లేదు. ఇప్పటికే మన విద్యార్థులు ఉన్నత విద్యకు, పరిశోధనలకు పనికిరావడం లేదు. దేశాభివృద్ధికి తోడ్పడగల విస్తృత విషయపరిజ్ఞానం వీరికి దక్కడం లేదు.

ఉన్నత విద్యలలో సంప్రదాయ జ్ఞానవ్యవస్థలపై కోర్సుల్ని తప్పనిసరి చేస్తున్నారు. వీటిల్లో భారతదేశ ప్రాచీన జ్ఞాన విజ్ఞానాల్ని వక్రీకరించి చెబుతున్నారు. పనిగట్టుకుని వైదిక సంస్కృత సంప్రదాయాన్ని మాత్రం ఆకాశానికెత్తు తున్నారు. ఇతర సాంస్కృతిక స్రవంతులను – ప్రత్యేకించి మధ్యయుగాల విజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని మతాల పట్ల ,సంస్కృతు పట్ల తీవ్ర వివక్షత కూడా ప్రదర్శిస్తున్నారు. ఇలా చరిత్రను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించడం వల్లా, విద్యార్థుల్ని విమర్శనాత్మకతకు దూరం చేయడం వల్లా, భారతదేశపు బహుళ సంప్రదాయసంస్కృతుల్ని చూడ నిరాకరించడం వల్లా ఏం జరుగుతుంది? మన భావితరం, మన ప్రజానీకం ఒక వైపుకి ఒరిగిపోతుంది. అంతిమంగా ఇది భారతదేశపు వైజ్ఞానిక పురోగతికి, సామాజిక సామరస్యానికి తీవ్రనష్టం కలిగిస్తుంది.

## సామాజిక దాడి

ఇటీవలి దశాబ్దాలలో దేశంలో మన సామాజిక మత వ్యవస్థల్లోకి మెజారిటీ మతరాజకీయశక్తులు చొచ్చుకొచ్చి ఛాందసవాదాన్ని, సంప్రదాయవాదాన్ని, గత వైభవ పునరుద్ధరణ వాదాన్ని పెంచి పోషిస్తున్నాయి. సంప్రదాయ మత కార్యక్రమాలు, పండగలు, వీటిని ముందుండి నడిపించే మత సంస్థలు పెరిగిపోతున్నాయి. అసంఖ్యాకంగా స్వామీజీలు పుట్టుకొస్తున్నారు. వీరికి కావల్సినన్ని వనరులు, చెప్పుకోదగ్గ అనుచర వర్గంతో పాటు ప్రభుత్వ వెన్నుదన్ను కూడా పుష్కలంగా లభిస్తున్నాయి. ఒకవైపు గొప్ప గొప్ప ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూనే వీరు మూఢనమ్మకాలను, నకిలీ సైన్సును, ఛాందసాన్ని విస్తరింప చేస్తున్నారు.

ప్రభుత్వ దన్నుతో కొన్ని సామాజిక శక్తులు సైన్సును వక్రీకరించడం, పురాణాల్ని చరిత్రగా భ్రమింప చేయడం జోరుగా చేస్తున్నాయి. తప్పుడు కథనాలతో మెజారిటీ మతాన్ని ,సంస్కృతిని సంఘటిత పరుస్తున్నాయి. వాస్తవానికి మెజారిటీ మతస్తుల్లోనూ భిన్న సంప్రదాయాలు ఉన్నాయన్నది వీరు విస్మరిస్తున్నారు. "భారతీయుల సంప్రదాయకాహారం శాకాహారం" లాంటి తప్పుడు ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. నిజానికి ప్రభుత్వ అధికారిక శాస్త్రీయ సర్వేలు, అధ్యయనాలు కూడా దీన్ని అంగీకరించవు.

కోవిడ్ మహమ్మారి చుట్టుముట్టిన కాలంలోనూ సాంప్రదాయక భారతీయ ఆరోగ్య పద్ధతులంటూ మూఢవిశ్వాసాలను ప్రచారంలోకి తెచ్చారు. ఆధునిక వైద్యాన్ని అపహాస్యం చేసేందుకు పూనుకున్నారు. దీపాలు పెట్టమని, పళ్లాలు వాయించమని పెద్దపెద్ద స్థానాల్లో ఉన్నవారే ప్రజల్ని పురమాయించారు. దీనికి గొప్ప శాస్త్రీయత ఉందని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు కథనాలు వెల్లువెత్తించారు. వాటి వల్ల కాస్మిక వైబ్రేషన్స్ విడుదలవుతున్నాయని నకిలీ రుజువులు చూపేందుకు సాహసించారు. నాసా లాంటి ప్రతిష్టాత్మక సంస్థ పేరును కూడా ఇందుకోసం వాడుకున్నారు. బాధాకరం ఏమంటే గొప్ప గొప్ప సైన్సు సంస్థలు సైతం తప్పుడు ఆధారాలతో నకిలీ సైన్సును అడ్డం పెట్టుకొని ఏవేవో నిర్ధారణలు చేసేస్తున్నాయి. పురాణాలకు విశ్వసనీయత కల్పించడానికి, వాటిలో పేర్కొన్న ప్రాచీన నదులకు కృత్రిమ సృష్టిని చేస్తున్నాయి. సైన్సు పట్ల ప్రజలకు గల గౌరవాన్ని దుర్వినియోగం చేస్తున్నాయి. ఫలితంగా శాస్త్రీయ పద్ధతుల్ని, రుజువుల్ని కూడా జనంలో గందరగోళ పరుస్తున్నాయి.

సామాజిక మాధ్యమాలు, డిజిటల్ టెక్నాలజీలు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వమే ముందుండి ప్రచారం చేస్తున్న అశాస్త్రీయభావాలను, నకలీ సైన్సును ,తప్పుడు కథనాలను, కుట్ర సిద్ధాంతాలను ఇవి బహుళ ప్రచారంలోకి తెస్తున్నాయి. శాస్త్రీయ ధోరణిని పనిగట్టుకొని వెనక్కునెడుతున్నాయి.

చివరిగా చెప్పుకోవలసింది ఏమంటే భారతదేశంలోని ఈ మత విశ్వాసాలే శాస్త్రీయ దృక్పథ అభివృద్ధికి ప్రధానమైన అడ్డంకి. విశ్వాసం భౌతికంగా కాదు. అందువల్ల అది విసిరే సవాళ్లకు సైన్స్సు, హేతుత్వం సమాధానం చెప్పలేకపోవచ్చు. వ్యక్తుల మత స్వేచ్ఛను, వారి విశ్వాసాలను గౌరవించి తీరాలి. కానీ అదే సందర్భంలో ఇతరుల హక్కుల్ని హరించడాన్ని అంగీకరించలేము. సామాజిక నియమాల్ని తారుమారు చేయడాన్ని ఒప్పుకోలేము. ఖచ్చితంగా ఈ ధోరణిని ప్రతిఘటించి తీరాల్సిందే. మన సమాజంలోనే కొన్ని మార్మిక ధోరణలున్న మాట కూడా వాస్తవం. అందువల్ల మన పోరాటం ఇప్పటితో ముగిసేది కాదు. ఇది మన సుదీర్ఘ పోరాటంలో ఒక భాగం మాత్రమే. అలాగే ఇంత సంఘటిత సవాళ్లు ఎదురవుతున్న కాలంలో శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేయడానికి మనకు స్పష్టమైన వ్యూహం కూడా ఉండి తీరాలి.

## ప్రకటన

శాస్త్రీయ దృక్పథ ప్రచారం పట్ల ఎంతో ఆసక్తీ, ఆకాంక్షా గల వివిధ శాస్త్రవేత్తలమూ, వివిధరంగాల మేధావులమూ అయిన మేము ఈ పోరాటం విస్తృతమైనది, సంక్లిష్టమైనది, బహుముఖమైనది అని గుర్తిస్తున్నాం. ఎన్ని సవాళ్లు, అవరోధాలు ఎదురైనా వీటిని ప్రతిఘటించి, తిప్పి కొట్టాలని గట్టిగా నమ్ముతున్నాం. ప్రజాబాహుళ్యంలోకి శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నాలకు సవాలక్ష సవాళ్లు ఎదురవుతాయనీ, ఇవి వ్యవస్థీకృతమైనవీ, బహుముఖీనమైనవీ అని కూడా మాకు తెలియంది కాదు. ఇలాంటి సవాళ్ల వల్ల, అశాస్త్రీయ భావజాలం, గుడ్డి విశ్వాసం, ఏ రుజువుకూ నిలబడనివీ సర్వవ్యాప్తం కావడమే కాదు ఛాందసత్వం, మత వివక్షావిభేదాలు మరింత పెరిగి సమాజంలోని మానవతావిలువలన్నీ ధ్వంసమవుతాయి. తప్పుడు కథనాలు, నిరాధార అభిప్రాయాలు మతం ముసుగులో భారతీయ సమాజాన్ని ఏకీకృత అధిక సంఖ్యాక అధిపత్యం వైపు మళ్ళించే ప్రమాదమూ పొంచి ఉంది.

ఈ క్రింది సంతకం దారులమైన మేము సమాజంలో శాస్త్రీయ దృక్పథ వ్యాప్తి ప్రాధాన్యతను మరోసారి నొక్కి వక్కాణిస్తున్నాము.. ప్రజాసైన్సు ఉద్యమం, దానితో భావసారూప్యం గల ఇతర సంస్థలు, వ్యక్తులు ఈ రంగంలో చేసిన కృషిని అభినందిస్తున్నాము. వీరందరికీ మరింత తోడ్పాటునందించేందుకు మేము పూనుకొంటున్నాము. భారత రాజ్యాంగ విలువలని సమున్నతంగా నిలబెట్టే లక్ష్యంతో ఏకాభిప్రాయం గల విద్యా పరిశోధనా సంస్థల్లోని మేధావులను, రాజకీయవర్గాలను ఈ కర్తవ్యం పట్ల స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాము.

* * * * *